'పంతులూ, నన్ను పెళ్లి చేసుకొంటావా?' అంది అరవింద ఎటో చూస్తూ.

ఆమె ప్రశ్నలో నిజం లేదని తెలుసు భాస్కరానికి. అందులో ఏదో వెటకారం గోచరించిందతనికి.

'నా మనసులోని బాధని గ్రహించకుండా నువ్వు నన్ను బాధ పెడుతున్నావు, అరవిందా. అవును కాని ఈ ప్రశ్న నీవు మనఃపూర్వకంగా వేశావా?' అన్నాడు భాస్కరం.

అరవింద చటుక్కున వెనక్కి తిరిగింది. ఆమె కళ్లలో కొద్దిగా నీళ్లు కనిపించాయి.

'అవును. నాలుగు డబ్బులు జేబులో వేసుకొని ఈ గడప తొక్కే ప్రతీ మగవాడిలాగే, నీకూ ఈ ప్రశ్నలోని అర్థం బోధపడదు. ఈ ప్రశ్నకి మీ జాతి ఎటువంటి సమాధానం ఇస్తుందన్నది, నీ జవాబే చెబుతుంది. ఇంకొక్క విషయం భాస్కరం. మీ శరీరంలోని వేడి తగ్గే వరకే మీ మాటలకి ఈ వేడి ఉంటుంది. రబ్బరుబొమ్మల్లాంటి మా జీవితాలతో ఆడుకొనే మీ మగవాళ్ళకి మా మనసులోని నిజాయితీ అర్థమవదు' అంది తీవ్రంగా.

'అరవిందా! నువ్వు అపార్థం చేసుకొన్నావు. అందరూ ఒక్కలాగుంటారని అనుకోవటంలో నువ్వు పొరపాటు పడుతున్నావనుకొంటాను' అన్నాడు, భాస్కరం ఓపిగ్గా.

'ఇది పొరపాటు కాదు, భాస్కరం. అనుభవం. అయినా నేను ఒకరి కోసం పాటుపడే దాన్ని కాదు. ఈ నాడు నా జీవితం ఇలా బజారుపాలయిందంటే, కారణం, ఎవరన్నదీ నీకు తెలియదూ?'

'తెలుసు.'

'ఇదే సత్యాన్ని మరొక్క మగవాడితో చెబితే ఏమంటాడు? మంచి కథ చెప్పావంటాడు. మా జీవితం కథేకదూ? ఏం, మాట్లాడవేం?'

'నేను నీ బాధ నర్థం చేసుకొన్నాను, అరవిందా. అయినా నీకు నేనుగా నిన్ను అర్థిస్తున్నాను. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నిన్ను పెళ్లి చేసుకొంటాను. నా యావదాస్తి నీకు రాసిస్తాను. నన్ను నమ్ము.'

అరవింద విరగబడి నవ్వింది. 'చూశావా, భాస్కరం? మళ్లీ నా జీవితా




-కాదంబరి గోపాలరావు

నికి నీ ఆస్తి ముడి వేశావు. ఆ ముడిలో నిన్ను నమ్ముకొని సర్వస్వాన్ని విడిచి వచ్చిన నీ భార్య జీవితం నలిగిపోతుందని ఆలోచించావా?'

నిర్విణ్ణుడై పోయాడు భాస్కరం. 'అరవిందా! నాకు పెళ్లయిందని నీ కెవ్వరు చెప్పారు?'

'పిల్లి కళ్లు మూసుకొని పాలు తాగుతుందట, ఎవ్వరూ చూడలేదని. అయినా నువ్వు అడిగావు కాబట్టి చెబుతున్నాను. శ్యామ్ చెప్పాడు.'

భాస్కరం ముఖం ఎర్రబడింది కోపంతో. 'నిన్ను ఈ స్థితికి తెచ్చిన శ్యామ్ మాటలా నమ్ముతున్నావు!' అనగలిగాడు.

'ఇక్కడొక తమాషా ఉంది, భాస్కరం. ఆడదానిలో ఉండే దౌర్బల్యమే అది. స్త్రీ మగవాడికి తన మనసుని మనఃపూర్వకంగా అర్పిస్తుంది. అదికేవలం ఒక వ్యక్తికే అంకితమౌతుంది. మొగ్గ ప్రాయంలో ఉన్న సంపెంగపువ్వు ఒకనాడు తాను వికసించి సువాసనల్ని వెదజల్లుతూ భగవంతుని సాన్నిధ్యానికి చేరుకొంటానని అనుకొంటుంది. కాని పరిమళం పొందిన ఆ పువ్వు పూజా పర్హారాలు. దానికి ధ్యేయం కాదు వాడిపోయే వరకూ. నా జీవితంకూడా అంతే. శ్యామ్‌ని మనఃపూర్వకంగా ప్రేమించాను. అతని మాటలకి వివశురాల్ని అయ్యాను. అయినా ఇప్పటికీ అతని పిరికితనాన్ని చూస్తే జాలి వేస్తుంది. ఒకప్పుడు శ్యామ్‌కూడా నిజం చెబుతూ ఉంటాడు. ఏం, నీకు పెళ్లి కాలేదా?'

'ఊఁ.'

'ఇది కేవలం కీలుబొమ్మలాట. నిన్ను నమ్మిన నీ భార్య జీవితాన్ని నాశనం చెయ్యకు. వెళ్లిపో' అంది అరవింద రుద్ధకంఠంతో.

'నేను వెళతాను. కాని, నీ కొక్క నిజం చెప్పాలి. అదీ మనిద్దరి జీవితాల్ని గాఢాంధకారంలోకి ఈడ్చిన శ్యామ్ ప్రసక్తి వచ్చింది కాబట్టి.

శ్యామ్‌ని నువ్వు ఆరాధించి, నేను నమ్మి మోసపోయాము. నేను ఇంటర్ పూర్తిచేసుకొని కలకత్తాలో మెడిసిన్‌లో జాయినయ్యాను. శ్యామ్‌కూడా ఆ తరవాత కలకత్తా వచ్చాడు. నా తోనే కలిసి ఉండేవాడు.

నేను రెండవ ఏడు మెడిసిన్ చదువుతూ ఉండగా నాకు మాధవీ ముఖర్జీ అనే బెంగాలీ అమ్మాయితో పరిచయం ఏర్పడింది.



గత కాలమె మేలు ...

ఫోటో— ఎమ్. కె. కుమార్ (విశాఖ—14)

ఆ అమ్మాయిది ఒక దీనగాథ. ఆమె తండ్రి దీనానాథముఖర్జీ పెద్ద గవర్నమెంటు ఉద్యోగి. ఆయన కలకత్తా దగ్గర్లోనే ఉండేవాడు. మాధవికి చిన్నప్పుడే తల్లి చనిపోయింది. చాలా కాలం వరకూ దీనానాథ్ మళ్లీ పెళ్లి చేసుకోకుండానే గడిపాడు. అయినా, ఆ తరవాత బంధుమిత్రుల ప్రోద్బలంతో మళ్లీ పెళ్లి చేసుకోక తప్పలేదు. కాని సవతి తల్లి మాధవిని నానా బాధలూ పెట్టేది. మాధవి పెద్దదైనా, సవతి తల్లిగా హృదయంలో మార్పు రాలేదు. ఆమె స్వార్థమే ఆమార్పు రానివ్వలేదు. దీనానాథ్ గత్యంతరంలేక మాధవిని హాస్టల్లో పెట్టి చదివించాడు. ఆమె సెలవులకుకూడా ఇంటికి వెళ్లేది కాదు.

అలాంటి మాధవితో నాకు పరిచయం ఏర్పడింది. మాధవి తన బాధల్ని నాతో చెబుతున్నప్పుడు, నా కెంతో జాలి వేసేది. ఆమెను ఊరడించే వాణ్ణి. అస్వతంత్రంగా ఉన్న నా ఆ పరిస్థితిలో నే నెటువంటి నిర్ణయాన్నీ తీసుకోలేక పోయేవాణ్ణి.

ఒకనాడు నేనూ, మాధవీ సినిమాకి వెళ్లాము. అప్పుడు హాల్లో శ్యామ్ కనబడ్డాడు. నేను భయపడ్డాను. కారణం — అతని మనస్తత్వం నాకు తెలుసు కాబట్టి. మాధవిని పరిచయం చేయటమా? మానటమా? అని సంశయించాను. కాని సభ్యత కోసం పరిచయం చేయక తప్పలేదు. పరిచయం అయిన ఆ కొద్ది క్షణాల్లోనే అతను అతి చనువుగా ప్రవర్తించాడు.

మొదటనుంచీ ముభావంగా ఉండే మాధవికి అతని ధోరణి నచ్చలేదు. సినిమా వదిలిన తరవాత ఎవరి దారిని వారు వెళ్లిపోయాము.

నేను భయపడినదంతా జరిగింది. శ్యామ్, మాధవి ఎక్కడైనా ఒంటరిగా కనబడితే చాలు, ఆమె ఎడల చాలా నీచంగా ప్రవర్తించేవాడట. ఆమె నాతో చెప్పుకొని బాధ పడేది. ఒకటి, రెండు సార్లు శ్యామ్‌ని వారించాముకూడా.

నాలుగవ సంవత్సరంలో ఉన్నప్పుడు దీనానాథ్ ఆకస్మికంగా చనిపోయాడని టెలిగ్రాం వచ్చింది. మాధవి కుప్పలా కూలిపోయింది. ఊరికి వెళ్లి వచ్చిన తరవాత, తను చదువు మానేస్తానని, గాఢాంధకారమైన తన బ్రతుక్కూ నావే వెలుగని ఏడ్చింది. నేను ఆమెను వారించాను. నేను చదివిస్తానని వాగ్దానం చేశాను. తను తప్పకుండా డాక్టరై, తన తండ్రి ఆశయాన్ని పూర్తి చెయ్యాలని మనోధైర్యాన్ని చెప్పాను. ఆమె నా మాటల్ని విశ్వసించింది. సరేనంది.

నేను ఇంటివద్ద మంచి ఎక్కువగా డబ్బు తెప్పించుకొనేవాణ్ణి. సెలవులకు కూడా ఇంటికి వెళ్లేవాణ్ణి కాదు. కారణం —నేనుకూడా వెళ్లిపోతే మాధవి ఏ అఘాయిత్యం చేస్తుందోనన్న భయం మాత్రమే.

ఒకనాడు హఠాత్తుగా నాన్నగారి దగ్గరినుంచి టెలిగ్రాం నన్ను వెంటనే బయలుదేరి రమ్మనమని వచ్చింది.

నేను ఊరికి బయలుదేరాను.

మాధవి ఏడ్చేసింది. తన కెందుకో భయంగా ఉందంది. మాధవికి ధైర్యం చెప్పి బయలుదేరాను.

నేను ఇంటికి చేరేసరికి అంతా ప్రశాంతంగా ఉంది. నాన్నగారు ఎందుకు నన్ను పిలిపించారో అర్థమవలేదు.

అదే విషయాన్ని నాన్నగార్ని అడిగాను.

ఆయన మండి పడ్డారు. "ఏం, నిన్ను అంత దూరం పంపిన వాడికి, పిలిపించే హక్కు లేదా? నిన్ను అంత దూరం పంపించింది చదువుకొందుకా లేక నీ ఇష్టమొచ్చినట్లు తిరగటానికా?" అని అడిగారు.

"నాన్నగారూ, మీ ఉద్దేశ్యం నా కర్థమవలేదు. అడగదలుచుకొన్నది సూటిగానే అడగవచ్చుగా?" అన్నాను.

నాన్నగారు సమాధానంగా రెండు, మూడు ఉత్తరాలు నా ముఖంమీద పడవేశారు.

వ్రాతనుబట్టి, ఆ ఉత్తరాలు శ్యామ్ వ్రాశాడని తెలిసి పోయింది. శ్యామ్ ఇలా పగ తీర్చుకొంటాడని ఊహించలేకపోయాను. నాకూ, మాధవికీ లేనిపోని సంబంధాలు కల్పించి కట్టు కథలు వ్రాశాడు. ఆ క్షణంలో అతన్ని ముక్కలు ముక్కలుగా నరికిపారేద్దామనిపించింది.

"నాన్నగారూ, మీరు నమ్ముతున్నారా?" అన్నాను అసహాయంగా.

"నిప్పు లేకుండా పొగ రాదు. పరిస్థితులు చేతులు దాటకుండా కట్టుబాటు చేయటం నా కర్తవ్యం. నా నిర్ణయాన్ని నీకు చెబుతున్నాను. నీకు వెంటనే పెళ్లి నిశ్చయం చేశాను" అన్నారాయన.

నిజం చెప్పినా వినడానికి ఓపిక లేని నాన్నగారి వద్ద, నిజం చెప్పినా లాభం లేదనుకొన్నాను.

నా అసమ్మతిని తెలిపి, వెంటనే కలకత్తాకి ప్రయాణమయ్యాను.

వెన్న లాంటి మనసు అమ్మది. నే నెక్కడ ఇబ్బంది పడతానో అని నాన్నగారికి తెలియకుండా కొంత డబ్బూ, నగలూ ఇచ్చి నన్ను పంపింది.

నా జరుగుబాటు గురించైనా ఆలోచన లేని నాకు అమ్మ సహాయం వెయ్యి రెట్లు బలాన్నిచ్చింది. ఆమె ఒడిలో తల దూర్చుకొని ఏడ్చేశాను.

( తరువాయి 39 వ పేజీలో )

# పతిత

( 35 వ పేజీ తరువాయి)

అమ్మ ఆశీర్వచనంతో కలకత్తా చేరుకొన్నాను. నాలో నేనే ఒక నిర్ణయానికి వచ్చేశాను. "ఎలాగూ నింద వచ్చింది. మాధవిని పెళ్లి చేసుకోవాలి" అనుకొన్నాను.

ఏ ఆశతో, ఏ నిర్ణయంతో నేను కలకత్తా చేరుకొన్నానో, అదే కరువైంది. మాధవి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకొంది.

మాధవి ఎందుకో చచ్చిపోయిందన్న ప్రశ్నకు సమాధానం నా కనవసరం. చూడు, అరవిందా! ఇందాకా నీ వన్నావు "స్త్రీకి మాత్రమే ప్రేమించే హక్కుఉం"దని. నీవు పొరపడ్డావు. నా శరీరంలో ప్రతి కణం, ఇప్పటికీ మాధవికి అంకితమైంది. ఆమెను నా జీవితంలో మరువలేను.

మరిచిపోలేని నా మనసులో, కక్ష గూడు కట్టుకొని పోయింది. ఎప్పటికైనా శ్యామ్‌ని చంపి తీరుతాను అనుకొన్నాను. కాని శ్యామ్ మళ్లీ నా కంటికి కనిపించలేదు. బ్రతికి పోయాడు. తెగిన గాలిపటంలా తయారయిన నా బ్రతుక్కి ధ్యేయం లేదు. చదువుకి స్వస్తి చెప్పేశాను. వేళకు తిండి లేని నేను ఒకనాడు అలహాబాదులో స్పృహతప్పి పడిపోయాను.

నన్ను ఎవరో ఆస్పత్రిలో చేర్పించారు. నా దగ్గరున్న ఉత్తరాల మూలంగా నా తల్లిదండ్రుల్ని పిలిపించి వాళ్లకి అప్పగించారు.

నేను మా ఊరు తిరిగి వచ్చినా, తిరిగి మనిషిగా తిరగటానికి ఏడాది పట్టింది.

నాన్నగారిలో మార్పు వచ్చింది. అమ్మ కళ్లలో ఆవేదన, ప్రేమ అలాగే నిలిచిపోయాయి. చివరకు అమ్మ ప్రోద్బలమే నన్ను సాంసారిక జీవితానికి తల ఒగ్గేటట్టు చేసింది.

నా పెళ్లి సుమిత్రతో యథావిధంగా జరిగిపోయింది. కాలిపోయిన నిప్పువుల్లలాంటిది నా బ్రతుకు. మండే మంటలాంటి వయసు సుమిత్రది. మా ఇద్దరిమధ్య ఏదో శూన్యం ఆవరించి ఉండేది. కాలగతిలో నన్ను నేనే సమర్థించుకొన్నాను. ఆమెతో కలిసి మెలిసి తిరగనారంభించాను. మంచి మనసు సుమిత్రది. అయినా నా మనస్సు మాధవిని మరిచిపోలేకపోయింది. ఒకనాడు సుమిత్రకి నా మనసుని విప్పి చెప్పుకొన్నాను. ఆమె మంచి ఓదార్పును ఆశించాను. ఆమె నన్ను అర్థం చేసుకొంటుందని ఆశపడ్డాను. కాని పరిస్థితి ఎదురు తిరిగింది. సుమిత్ర నన్ను అపార్థం చేసుకుంది. తన్ని మోసం చేసి పెళ్లి చేశారని, తనేవిధమైన సౌఖ్యాన్ని పొందలేక పోతున్నానని



కీర సందేశం

చిత్రం— కె. రంగారావు (దేవరకొండ)

ఏడవ నారంభించింది. ఈ పరిణామానికి నేను తట్టుకోలేకపోయాను. నే నెక్కడ మళ్లీ పారిపోతానో అని నా తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు.

ఒకనాడు సుమిత్ర పుట్టేనింటికి వెళ్లిపోతానంది. నా గుండె రాయి చేసుకొన్నాను. నేనూ ఏమీ అభ్యంతరం చెప్పలేదు.

నా బాధకు, మాధవి జ్ఞాపకాలే ఉపశమనాలు.

సర్వ విధాలా భ్రష్టత్వం పొందిన నాకు శారీరకమైన వాంఛలు నశించాయి. నేను నీ దగ్గరనుంచి ఆశించింది నీ శరీరం కాదు. నీ ప్రేమ: నీ లాలన. ఇందులో తప్పేమైనా ఉందా, అరవిందా? నువ్వు చదువుకొన్నదానివి. పరిస్థితులు నిన్నీ మార్గానికి ఈడ్చుకొచ్చాయి. చెప్పు.'

అరవింద కళ్లలో నీళ్లు నిలిచాయి. 'భాస్కరం, నిన్ను అపార్థం చేసుకున్నాను. అయినా ఆడదాన్ని కాబట్టి నీ కొక మాట చెప్పాలి. నేను మగవాడి ప్రేమను తృణీకరించానని బాధ పడ్డావు. చూడు, మగవాడు ఒక స్త్రీనుండి శారీరకమైన సుఖాన్ని పొందినప్పుడు, మానసికంగా ఆ స్త్రీ మీద గౌరవాన్నీ, ప్రేమనీ అంచెలు అంచెలుగా తగ్గించుకొని వస్తాడు. కాని అదే స్త్రీ, ఆ మొదటి రోజునుంచీ, ఆ వ్యక్తిమీద ఆశని, మరింత పెంచుకొంటుంది. సర్వస్వాన్ని నమ్మి ధారపోసిన స్త్రీ అంతకంటే ఏమి చెయ్యగలదు? ఈదృష్టితోనే నేను ఆ మాట అన్నానుగాని, మరొక ఉద్దేశ్యం నాకు లేదు.

ఏ స్త్రీ అయినా భర్త సాన్నిధ్యంలో సర్వ సౌఖ్యాలు పొందుదామనే ఆరాటాన్ని ప్రదర్శిస్తుంది. అలా కోరుకోవటంలో ఏ మాత్రం తప్పు లేదు. తన భర్త జీవితంలో జీవం లేని ఒక ఊహ మాత్రం చెలగాటలాడటం ఏ స్త్రీ సహించలేదు. సుమిత్ర అమాయకురాలు. సాధించి నీ ప్రేమను పొందుదామనుకొంది. కాని నీకే దూరమై పోయింది. నీ వంటావా? ప్రేమించే మనసు ఉండీ పొందలేని సంతృప్తిని, జ్ఞాపకాలతో పొందుదామనుకొని, దగ్గర ఉన్న స్వర్గాన్ని దూరం చేసుకొన్నావు. నా నుండి ఆశించిన ప్రేమ, మంచిగా నీ భార్య నుంచే పొందవచ్చు. నేనూ చదువుకొన్నాను. అయినా నేను నడుస్తున్న బాట భయంకరమైనది. సంఘం నన్ను మామూలు స్త్రీగా లెక్క వేయదు. నేను నిన్ను అర్థించేది ఒక్కటే. అమాయకురాలైన సుమిత్ర మనసు రాయి చెయ్యకు. ఇంతకంటే నేను నిన్ను అర్థించేది లేదు. నా బ్రతుకుని ఎవ్వరూ సరిచెయ్య లేరు. అన్నట్లు చెప్పటం మరిచాను. శ్యామ్ ఇప్పుడు వస్తానన్నాడు. ఇంక నువ్వు వెళ్లిపో!' అన్న అరవింద మాటలు పూర్తికాకుండానే శ్యామ్ వచ్చేశాడు.

శ్యామ్ లోపలికి ప్రవేశిస్తూనే అన్నాడు: 'ఓ భాస్కర్, నువ్వట్రా! ఏమిటీ ఇంత దూరం? అవును. నాకు పెళ్లి అయిందట కదూ. ఎంతమంది పిల్లలు?'

భాస్కరంలో ప్రతీకారం ప్రజ్వరిల్లింది. ఆవేశంగా పళ్లు కోసుకొనే కత్తి తీసుకొని లేచాడు. 'నీచుడా? నీ చావే నిన్నీ వేళ ఇక్కడకు తీసుకొని వచ్చింది. నువ్వు బ్రతకకూడదు' అంటూ మీదికి ఉరికాడు.

పరిస్థితి గ్రహించిన అరవింద భాస్కరాన్ని వెనక్కి లాగివేసింది. 'భాస్కరం'వ్యక్తిగత సమస్యల్ని నా గడపలో పరిష్కారం చెయ్యవద్దు. నా మీద ఏ విధమైన అభిమానమున్నా వెళ్లిపో!' అంది.

భాస్కరం తమాయించుకొని వెళ్లిపోయాడు.

'ఏమిటి అరవిందా! ఎందుకో వాణ్ణి ఇక్కడకు రానిచ్చావ్? నువ్వు అడ్డు రాకపోతే వాణ్ణి ఈ పాటికి చంపేద్దును' అన్నాడు గంభీరంగా శ్యామ్.

'అది నువ్వు చెయ్యలేవు, శ్యామ్' అంది తేలిగ్గా అరవింద.

శ్యామ్ మాట్లాడలేకపోయాడు.

తిరిగి అరవింద అంది: 'శ్యామ్, విస్కీ వేసుకొంటావా?'

'ఈ సమయంలో దాని అవసరం ఎంతైనా ఉంది. ఇయ్యి'—శ్యామ్ బాగా తాగాడు. 'శ్యామ్ నా మాటలు వింటున్నావా' అంది అరవింద.

'ఓ! చెప్పు' అన్నాడు శ్యామ్.

'శ్యామ్, కొందరు తప్పు పనులు స్వప్రయోజనాల కోసం చేస్తూనే ఉంటారు. దాని పరిణామం ఇతర మనుష్యుల భవిష్యాన్ని ఎలా పాడుచేస్తుందో వాళ్లే ఊహించరు. అలాంటి స్వార్థపరులు సంఘంలో ఠీవిగా తిరుగుతారు. నువ్వు, మా జీవితాల్ని నాశనం చేశావు. నువ్వింకెన్ని జీవితాల్ని నాశనం చేస్తావో! నిన్ను పిచ్చిగా ప్రేమించి పతిత నయ్యాను. నీకు ఆశ్రయమిచ్చి, భాస్కరం శాంతిని కోల్పోయాడు. నువ్వు బ్రతకటానికి వీలులేదు. . .' శ్యామ్ గుండెలో ఫ్రూట్ కట్టరు దిగబడిపోయింది. రక్తపుమడుగులో స్పృహ లేక కొట్టుకుంటున్న శ్యామ్‌ని చూసి అరవింద రెండు కంటిబొట్లు రాల్చింది. 'మధుపానంలో మత్తెక్కి కొట్టుకుని చస్తున్నావు. దానికంటే మధురమైన నీ మాటలతో నన్ను మధ్య పరిచావు. అయినా నీ ప్రేమకు నేను వివశురాలిని. నన్ను క్షమిస్తావు కదూ?' అంటూ కళ్లు మూసుకొంది. ★